బీచ్‌లో పర్యాటకుల సందడి

మొగల్తూరు : బీచ్‌లో పర్యాటకులతో సందడి నెలకొంది. మండలంలోని కెపిపాలెం సౌత్, పేరుపాలెం సౌత్ గ్రామాల్లో విస్తరించి ఉన్న బీచ్ ఆదివారం పర్యాటకులతో కళకళలాడింది. కార్తీకమాసంను పురస్కరించుకుని వన సమారాధన పేరిట ప్రతీ ఏటా వేలు ప్రాంతాల నుండి సందర్శకులు, పర్యాటకులు ప్రత్యేక ద్విచక్ర వాహనాలలో భారీగా తరలివస్తారు. ఈ ఆదివారం సుమారు 10 వేల మంది సందర్శకులు తరలివచ్చినట్లు అంచనా. కార్తీకమాసం ప్రారంభమైనా తుపాన్ ప్రభావంతో అలల ఉధృతిని దృష్టిలో ఉంచుకొని అధికారులు నేటి వరకూ బీచ్‌కు సందర్శకులను అనుమతించలేదు. మూడో ఆదివారం వాతావరణం అనుకూలంగా ఉండటంతో పర్యాటకులను అనుమతించడంతో సందర్శకులతో బీచ్ కళకళలాడింది. సరివి కొబ్బరి తోటలో సహపంతి భోజనాలు చేసి సేద తీరారు. సిఐ దుర్గాప్రసాద్ పర్యవేక్షణలో ఎస్ఐ జి.వాసు ఆధ్వర్యాన పోలీస్ సిబ్బంది, మెరైన్ పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది బందోబస్తు చేశారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా భారీకేట్లు ఏర్పాటు చేసి గజ ఈతగాళ్లను నియమించారు.

గ్రంథాలయానికి.. 'గూడు' కట్టండయ్యా..!

- శిథిలావస్థలో జిల్లా గ్రంథాలయ భవనం
- రోజూ 200 మంది పాఠకులు వస్తున్నా పట్టించుకోని ప్రభుత్వం
- కొత్త భవన నిర్మాణ కోసం రూ.2.99 కోట్లతో ప్రతిపాదనలు
- తాత్కాలిక వసతి కోసం గ్రంథాలయ అధికారుల తిప్పలు
- ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారుల చుట్టూ కాళ్లరిగేలా తిరుగుతున్న దుస్థితి
- ప్రత్యేక అధికారి లేరాయే
- స్థానిక సంస్థల నుంచి రావాల్సిన చెస్ బకాయి సొమ్ము దాదాపు రూ.20 కోట్లు

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

ఎంతోమంది విద్యార్థులకు, నిరుద్యోగులకు, పుస్తక ప్రియులకు, పత్రికలు చదివే పాఠకులకు విజ్ఞానాన్ని అందించే జిల్లా గ్రంథాలయం దుస్థితి అత్యంత ఘోరంగా మారింది. ప్రజాప్రతినిధులు, జిల్లా ఉన్నతాధికారుల నిర్లక్ష్యం కారణంగా జిల్లా గ్రంథాలయం దిక్కులేని స్థితికి చేరింది. శిథిలావస్థకు చేరిన భవన స్థానంలో కొత్త భవన నిర్మాణం కోసం గ్రంథాలయ అధికారులు పడుతున్న ఇబ్బందులు వర్ణనాతీతంగా మారాయి. కొత్త భవన నిర్మాణం, అప్పటి వరకూ తాత్కాలిక వసతి కోసం గ్రంథాలయ అధికారులు, ప్రజాప్రతినిధులు, జిల్లా ఉన్నతాధికారుల చుట్టూ కాళ్లరిగేలా తిరుగుతున్నా పట్టించుకునే నాథుడే లేకుండా పోయాడు. విజ్ఞానాన్ని పంచే గ్రంథాలయాల పట్ల ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరు అత్యంత దారుణమన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఏలూరులోని జిల్లా గ్రంథాలయం దశాబ్దాల తరబడి ఎంతో మందికి విజ్ఞానాన్ని పంచుతోంది. ఎంతో మంది నిరుద్యోగులు ఇక్కడ చదువుకుని ఉద్యోగాలు సైతం సాధించారు. ఇప్పటికీ ప్రతిరోజూ 200 మంది ఈ గ్రంథాలయానికి పుస్తక ప్రియులు వస్తుంటారు. అన్ని పత్రికలు ఇక్కడకు వస్తాయి. గ్రంథాలయంలో పాఠకులు చదువుకునేందుకు లక్షా 60 వేల వరకూ పుస్తకాలు ఉన్నాయి. ఏలూరు నగర ప్రజలతోపాటు, చుట్టు పక్కల గ్రామాల ప్రజలకు విజ్ఞాన్ని అందించే గ్రంథాలయాన్ని అధికారుల నిర్లక్ష్యంతో చిదిమేస్తున్న దుస్థితి నెలకొంది. ప్రస్తుతం ఉన్న జిల్లా గ్రంథాలయ భవనం శిథిలావస్థకు చేరింది. వర్షం నీరు రావడంతో పైఅంతస్తును పూర్తిగా ఖాళీ చేసిన పరిస్థితి ఏర్పడింది. శిథిల భవనం పడగొట్టి కొత్త భవనం నిర్మించాలని గ్రంథాలయ అధికారులు ఎప్పటినుంచో ప్రభుత్వాన్ని, ఉన్నతాధికారులను కోరుతూనే ఉన్నారు. ఎట్టకేలకు రూ.2.99 కోట్ల ప్రతిపాదనలకు ఆమోదం తెలిపారు. కొత్త భవనం నిర్మించాలంటే గ్రంథాలయాన్ని తాత్కాలికంగా వేరేచోటకు మార్చాల్సి ఉంది. దీనికోసం ఏలూరులోని సైన్స్‌పార్కులో భవనం, వ్యవసాయశాఖకు చెందిన పాత భవనం ఉన్నాయి. వీటిలో ఏదైనా భవనం తాత్కాలికంగా ఇవ్వాలని, లేకపోతే వేరేచోట వసతి కల్పించాలని గ్రంథాలయ అధికారులు ఎంపీ, ఎంఎల్‌ఎ, జిల్లా పరిషత్ చైర్మన్‌తోపాటు జిల్లా ఉన్నతాధికారులందరినీ కలిసి వేడుకుంటున్నారు. గ్రంథాలయం గురించి ఏ ఒక్కరూ ఆలోచించని పరిస్థితి నెలకొంది. దీంతో శిథిలావస్థకు చేరిన గ్రంథాలయ భవనంలోకే జనం వెళ్లే పరిస్థితి నెలకొంది. ప్రభుత్వం గ్రంథాలయ చైర్మన్‌ను నియమించలేదు. నిబంధనల ప్రకారం అప్పటి వరకూ ప్రత్యేక అధికారిని నియమించాలి. గతంలో జాయింట్ కలెక్టర్ ప్రత్యేక అధికారిగా ఉండేవారు. గడువు పూర్తయినా ప్రత్యేక అధికారి నియామకం జరగలేదు. దీంతో గ్రంథాలయం గురించి పట్టించుకునేవారే లేకుండా పోయారు. ప్రజలకు విజ్ఞానాన్ని పంచే గ్రంథాలయం పట్ల ప్రజాప్రతినిధులు, అధికారులు ఎందుకు ఇంత చిన్నచూపు చూస్తున్నారో అర్థంకాని పరిస్థితి నెలకొంది.

శిథిలావస్థకు చేరిన జిల్లా గ్రంథాలయ భవనం

గ్రంథాలయంలో చదువుకుంటున్న పాఠకులు

నిధులు గురించి పట్టించుకోని పరిస్థితి..

జిల్లా గ్రంథాలయానికి అనుబంధంగా జిల్లా వ్యాప్తంగా 72 గ్రంథాలయాలు ఉన్నాయి. ఎంతో మంది చదువరులు ఈ గ్రంథాలయాలకు వెళ్లి పుస్తక పఠనం చేస్తున్నారు. మున్సిపాల్టీలు, పంచాయతీలకు వచ్చే పన్నుల నుంచి నూటికి ఎనిమిది పైసలు గ్రంథాలయాలకు ఇవ్వాల్సి ఉంది. ఆ సొమ్ములు కూడా సరిగా ఇవ్వడం లేదు. ఏలూరు కార్పొరేషన్ నుంచి రూ.పది కోట్లు బకాయి గ్రంథాలయానికి ఇవ్వాల్సి ఉన్నా పట్టించుకోని పరిస్థితి నెలకొంది. మిగిలిన మున్సిపాల్టీలు, పంచాయతీల నుంచి మరో రూ.పది కోట్ల వరకూ రావాల్సి ఉంది. దాదాపు రూ.20 కోట్లు బకాయిలు ఉన్నా ఏ ఒక్కరూ పట్టించుకోవడం లేదు. ఉద్యోగులకు జీతాలు, కొత్త పుస్తకాల కొనుగోలు, భవన నిర్మాణం ఏది చేయాలన్నా స్థానిక సంస్థల నుంచి వచ్చే నిధులే ఆధారం. అయినప్పటికీ గ్రంథాలయాల గురించి పట్టించుకునే నాథుడే కరువయ్యాడు. జిల్లా గ్రంథాలయం కొత్త భవన నిర్మాణంపై ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు దృష్టి సారించాల్సిన అవసరం ఉంది. తాత్కాలిక వసతి ఏర్పాటుపైన వెంటనే చర్యలు తీసుకోవాలి. లేకపోతే విజ్ఞాన భాండాగారం పరిస్థితి అత్యంత ఘోరంగా మారనుంది.

1100 సేవలు సద్వినియోగం చేసుకోవాలి

నేడు యథావిధిగా పిజిఆర్ఎస్ - కలెక్టర్ చదలవాడ నాగరాణి

ప్రజాశక్తి - భీమవరం

ప్రజా సమస్యల పరిష్కారానికి మీ కోసం కాల్ సెంటర్ 1100 సేవలను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి తెలిపారు. అర్జీదారులు దాఖలు చేసిన తమ అర్జీలు ఇప్పటికీ పరిష్కారం కాకపోయినా లేదా తమ ఫిర్యాదులకు సంబంధించిన సమాచారం తెలుసుకోవడానికి 1100 నంబర్‌కు కాల్ చేయొచ్చన్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని తమ సమస్యలకు పరిష్కారం పొందాలని విజ్ఞప్తి చేశారు. ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించి వాటిని పరిష్కరించే ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థను ఈ సోమవారం 10న కలెక్టరేట్‌లో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అర్జీదారులు వారి అర్జీలు నమోదు చేసుకోవడానికి Meekosam.ap.gov.in వెబ్‌సైట్‌లో వారి అర్జీలు నమోదు చేసుకోవచ్చన్నారు. ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ అర్జీల స్వీకరణ కార్యక్రమాన్ని జిల్లా కేంద్రంతో పాటు డివిజన్, మండల, మున్సిపల్ స్థాయిలో కూడా నిర్వహిస్తామన్నారు. అర్జీదారులు ఈ విషయాన్ని గమనించి తమ ఫిర్యాదులను సమీపంలోని డివిజన్, మండల కార్యాలయాలు మున్సిపల్ కార్యాలయాల్లో కూడా సమర్పించు కోవచ్చని తెలిపారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ విజ్ఞప్తి చేశారు.

నేడు, రేపు అత్తిలిలో వ్యకాస 32వ మహాసభ

సంఘం జిల్లా కార్యదర్శి సత్యనారాయణ

ప్రజాశక్తి - భీమవరం

ఎపి వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా 32వ మహాసభ అత్తిలిలో ఈ నెల 10, 11 తేదీల్లో నిర్వహించనున్నట్లు సంఘం జిల్లా కార్యదర్శి జక్కంశెట్టి సత్యనారాయణ తెలిపారు. 1934లో నెల్లూరు జిల్లా అలగాని పాడులో పీడిత ప్రజల ఆశాజ్యోతి పుచ్చలపల్లి సుందరయ్య వ్యవసాయ కార్మిక సంఘం విత్తనాన్ని నాటారని, అది నేడు దేశవ్యాప్తంగా మహావృక్షంలా తయారైందని, నేడు అఖిల భారత వ్యవసాయ కార్మిక సంఘంగా రూపాంతరం చెందిందని తెలిపారు. సుమారు 92 సంవత్సరాల నుండి దేశంలో గ్రామీణ ప్రాంతాల్లో వ్యవసాయ రంగంపై ఆధారపడి జీవిస్తున్న వ్యవసాయ కార్మికుల సమస్యలపై పనిచేస్తోందన్నారు. దున్నేవారికే భూమి ఇవ్వాలని, వ్యవసాయ కార్మికుల కనీస వేతన జిఒ అమలు చేయాలని, ఇల్లులేని పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని, సంక్షేమ పథకాలు నిజమైన పేదలకు అందాలని, పనుల్లేని రోజుల్లో పని కల్పించేందుకు పోరాడి తెచ్చుకున్న ఉపాధి హామీ చట్టాన్ని పటిష్టంగా అమలు చేయాలని అనేక సమస్యలపై దేశవ్యాప్తంగా పోరాడుతోందని తెలిపారు. జిల్లాలో వ్యవసాయ రంగంలో గతంలో వ్యవసాయ కార్మికులే పని చేసేవారని, నేడు యాంత్రీకరణ, ఆక్వా, రియల్ ఎస్టేట్, వ్యవసాయ ఇతర అనేక మార్పులు వచ్చిన తర్వాత వ్యవసాయ కార్మికుల పరిస్థితి స్థిరమైన ఉపాధి లేకుండా పోయిందన్నారు. ఈ పరిస్థితుల్లో సంఘం జిల్లా 32వ మహాసభలు 10, 11 తేదీల్లో అత్తిలిలో అఖిల భారత వ్యవసాయ కార్మిక సంఘం అధ్యక్షులుగా కేరళ ముఖ్యమంత్రిగా పనిచేసిన విఎస్ అచ్యుతనందన్ ప్రాంగణంలోని జిల్లా ఎర్రజెండా ముద్దుబిడ్డ తుది శ్వాస విడిచే వరకూ పీడిత ప్రజల కోసం పనిచేసిన ఆర్ఎస్ నగర్‌లో జరుగుతున్నాయని తెలిపారు. ఈ మహాసభకు ముఖ్యఅతిథిగా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి.వెంకటేశ్వర్లు హాజరవుతున్నారని ఈ మహాసభల జయప్రదానికి ప్రతి ఒక్కరూ సహకరించాలని విజ్ఞప్తిచేశారు.

దాతృత్వానికి మారుపేరు పశ్చిమ

కలెక్టర్ చదలవాడ నాగరాణి

ప్రజాశక్తి - తణుకు

పశ్చిమగోదావరి జిల్లా అంటేనే దాతృత్వానికి మారు పేరు అని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి అన్నారు. డాక్టర్ పిఎన్ఎస్ కిరణ్ ఛారిటబుల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం తణుకు కమ్మ కళ్యాణ మండపంలో నిర్వహించిన వికలాంగుల ఆత్మీయ సమ్మేళనం కార్యక్రమంలో ఆమె ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఫౌండేషన్ ఛైర్మన్ బొల్లా సతీష్ అధ్యక్షతన జరిగిన ఈ సందర్భంగా కలెక్టర్ నాగరాణి మాట్లాడుతూ స్నేహితుడి పేరుతో ఫౌండేషన్ ఏర్పాటు చేసి వికలాంగులకు వెన్నంటి ఉంటూ వారి అవసరాలను తీర్చుతూ ఎన్నో సేవా కార్యక్రమాలు చేపడుతున్న సతీష్‌ను ఆమె కొనియాడారు. రాష్ట్ర వ్యాప్తంగా వికలాంగులకు సేవ చేయాలనే లక్ష్యంతో వారికి కృత్రిమ అవయవాలు అందించడంతోపాటు వారి అవసరాలు తీర్చుతూ వారి కాళ్లపై వారు నిలబడేలా సహకారం అందించడం అభినందనీయమన్నారు. ఇలాంటి సేవా కార్యక్రమాలు ప్రస్తుత యువత, విద్యార్థులకు స్ఫూర్తిదాయకమన్నారు. వారి కోసం కాకుండా పరుల కోసం బతికే వాళ్లే నిజమైన మనుషులని చెప్పిన స్వామి వివేకానంద మాటలను స్ఫూర్తిగా తీసుకుని ఇలాంటి కార్యక్రమాలు చేపట్టడం సంతోషమన్నారు. రాబోయే రోజుల్లో ఎంఎల్ఎ ఆరిమిల్లి రాధాకృష్ణ సహకారంతో వికలాంగులకు మరిన్ని కార్యక్రమాలు చేపడతామని కలెక్టర్ పేర్కొన్నారు. ఎంఎల్ఎ రాధాకృష్ణ సతీమణి ఆరిమిల్లి కృష్ణతులసి మాట్లాడుతూ వికలాంగుల ఆత్మీయ సమ్మేళనం పేరుతో ఏర్పాటు చేసిన సంకల్పం 2025 కార్యక్రమం ద్వారా ఎంతో అద్భుతమైన అనుభూతిని పొందగలిగానని తెలిపారు. తణుకు ప్రాంతంలో దాతృత్వం కలిగిన దాతలు ఉన్నారంటే గర్వకారణంగా ఉందన్నారు. కృత్రిమ అవయవాలు అందజేయడంతోపాటు ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేయడం సంతోషకరమన్నారు. ఎంఎల్ఎ రాధాకృష్ణ న్యూజిలాండ్ నుంచి తన వీడియో సందేశాన్ని పంపారు. అనంతరం సుమారు 100 మందికి కృత్రిమ అవయవాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులు, టిడిపి కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వికలాంగులతో మాట్లాడుతున్న కలెక్టర్ నాగరాణి

బిసిల ద్రోహి జగన్

మంత్రి నిమ్మల రామానాయుడు

కార్మికుడిగా మారి మంత్రి శ్రమదానం

ప్రజాశక్తి - పాలకొల్లు

4 దశాబ్దాల నుంచి ఉన్న 34 శాతం బీసీల స్థానిక సంస్థల రిజర్వేషన్‌ను 24 శాతం తగ్గించిన బిసి ద్రోహి జగన్ అని రాష్ట్ర జల వనరుల శాఖా మంత్రి నిమ్మల రామానాయుడు చెప్పారు. పాలకొల్లులో రూ.3 కోట్లతో నిర్మిస్తున్న గౌడ, శెట్టిబలిజ కళ్యాణ మండపం స్లాబ్ నిర్మాణ పనుల్లో మంత్రి ఆదివారం శ్రమదానం చేశారు. భవన నిర్మాణ కార్మికులతో కలిసి కాంక్రీట్, ఇసుక, సిమెంటును గమేలాలతో నెత్తి మీద పెట్టుకొని మోశారు. టిడిపి అంటేనే బిసి అని, బిసి అంటేనే టిడిపి అని తెలిపారు. గత టిడిపి ప్రభుత్వంలో రూ.1.50 కోట్లు మంజూరై మొదటి స్లాబు పనులు జరిగాయని చెప్పారు. వైసిపి ప్రభుత్వంలో రూపాయి ఖర్చు, అర బస్తా సిమెంట్ పని నోచుకోలేదన్నారు. కూటమి ప్రభుత్వం మూడు కోట్లు నిధులు మంజూరు చేయడంతో మళ్లీ పనులు మొదలయ్యాయన్నారు. 4 దశాబ్దాల నుంచి ఉన్న 34 శాతం బిసిల స్థానిక సంస్థల రిజర్వేషన్‌ను 24 శాతం తగ్గించిన బిసి ద్రోహి జగన్ అన్నారు. జగన్ రిజర్వేషన్ తగ్గించడంతో 16 వేల పోస్టులు స్థానిక సంస్థల్లో బిసిలు నష్టపోయారని చెప్పారు.

యువతకు స్కాలర్ షిప్ ఇవ్వడం అభినందనీయం

ఇతర దేశాలు వెళ్లి ఆర్థికంగా స్థిర పడినవారు తమ సొంత దేశంలోని ప్రజలు బాగుండాలని ఆర్థికంగా వెనుకబడిన విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు ఇవ్వడం ఆనందదాయకమని జల వనరుల శాఖా మంత్రి నిమ్మల రామానాయుడు చెప్పారు. అమెరికన్ తెలుగు అసోసియేషన్ ఆధ్వర్యంలో 200 మంది విద్యార్థులకు రూ.15 వేల చొప్పున స్కాలర్‌షిప్ పాలకొల్లు వెంకటేశ్వర కళ్యాణ మండపంలో ఆదివారం అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ మనం బాగుంటే సరిపోదని తమ కులం వారు కూడా బాగుండాలని ఆలోచనతో ఈ స్కాలర్‌షిప్‌లు ఇస్తున్నారని అభినందించారు. హైదరాబాద్ కు చెందిన ఆల్ ఇండియా తెలగ బలిజ కాపు సంఘం ఆధ్వర్యంలో ఈ స్కాలర్షిప్‌లు అందజేశారు. చదువుతోపాటు ఇతర రంగాల్లో నైపుణ్యం, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌లో డిప్లొమా నేర్చుకోవాలని మన అమెరికన్ తెలుగు అసోసియేషన్ (మాటా) వ్యవస్థాపక కార్యదర్శి వెంకటేశ్వరరావు అద్దేపల్లి చెప్పారు. కార్యక్రమంలో వైఎన్ కళాశాల సెక్రటరీ చినమిల్లి సత్యనారాయణ, ఎఐటిబికెఎస్ అధ్యక్షులు శ్రీహరి కోవెల, బోనం నరసయ్య, వంగా నరసింహారావు, పి.వినాయక స్వామి, అల్లు పీర్ల స్వామి చవాకుల నరేష్, కాపు కార్పొరేషన్ ఛైర్మన్ కొత్తపల్లి సుబ్బారాయుడు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న మంత్రి నిమ్మల రామానాయుడు

నిత్య బోధనతో పాటు పరిశోధనలు ఆదర్శం!

ఉప్పు నీటి ప్రభావంతో కోనసీమ కొబ్బరితోటల సంక్షోభంపై పరిశోధన

అంతర్జాతీయ జర్నల్లో డాక్టర్ యర్రంశెట్టి పరిశోధనలకు చోటు

అభినందించిన మంత్రి నిమ్మల రామానాయుడు

ప్రజాశక్తి - పాలకొల్లు

నిత్య బోధనతో పాటు ఎలక్ట్రానిక్స్, భౌతిక, సామాజిక అంశాలపై పరిశోధనలు చేయడమే కాకుండా తన చుట్టూ పరిస్థితులపై కూడా అధ్యయనం చేయడం ఆదర్శమని కోనసీమకు చెందిన అధ్యాపకుడు డాక్టర్ విజయ్ సత్య ప్రసాద్, యర్రంశెట్టి రాష్ట్ర సాగునీటి పారుదల శాఖా మంత్రి డాక్టర్ నిమ్మల రామానాయుడు అభినందించారు. రాష్ట్రంలోని కీలక గోదావరి డెల్టా వ్యవస్థ అంతర్భాగమైన డాక్టర్ బిఆర్.అంబేడ్కర్ కోనసీమ జిల్లా కేశనపల్లి ప్రాంతం ఉప్పునీటి ప్రభావంతో ఎదుర్కొంటున్న తీవ్రమైన పర్యావరణ, సామాజిక-ఆర్థిక సంక్షోభంపై డాక్టర్ యర్రంశెట్టి పరిశోధన చేశారు. ఈ సమస్యకు మూలకారణం శంకరగుప్తం మేజర్ డ్రెయిన్ ద్వారా లవణ జలం(ఉప్పునీరు) ప్రవేశించడం, ఇది కేశనపల్లితో పాటు కనీసం తొమ్మిది ఇతర గ్రామాలలో కొబ్బరి, వరి పంటలకు తీవ్ర నష్టాన్ని కలిగించడంపై ఆయన చేసిన పరిశోధనకు ఇంటర్నేషనల్ జర్నల్ ఆఫ్ రీసెర్చ్ ఇన్ ఇంజినీరింగ్, సైన్స్‌లో చోటు లభించింది. అలాగే రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అడుగులు వేస్తున్న క్వాంటం టెక్నాలజీలో 'క్వాంటం సిములేటర్స్ ఫర్ ఫండమెంటల్ ఫిజిక్స్ ఇన్ ప్రెసెంట్ టెక్నికల్ సొసైటీ' అంశంపై ఆయన చేసిన పరిశోధన 'జర్నల్ ఆఫ్ అడ్వాన్స్ అండ్ ఫ్యూచర్ రీసెర్చ్' జర్నల్‌లో ప్రచురితమైంది. ఎలక్ట్రానిక్స్‌లో 'ఫీశిబిలిటీ ఆఫ్ మిల్లిమీటర్ వేవ్ సెల్యూలర్ కమ్యూనికేషన్స్'పై చేసిన పరిశోధన ప్రతులను మంత్రి నిమ్మల ఆదివారం పాలకొల్లులోని క్యాంపు కార్యాలయంలో పరిశీలించారు. ఇలాంటి మరిన్ని పరిశోధనలు చేసి విద్యార్థులను కూడా ఆ దిశగా ప్రేరేపించాలని సూచించారు. అలాగే కేశనపల్లి సంక్షోభాన్ని పరిష్కరించడానికి, ఒక సమగ్ర వ్యూహాత్మక ప్రణాళిక అవసరమని మంత్రి అన్నారు. అందుకోసం ఈ పరిశోధనలోని అంశాలను కూడా పరిగణలోకి తీసుకొని పూర్తి స్థాయి కార్యాచరణను పునరుద్ధరించడానికి చర్యలు తీసుకుంటామని చెప్పారు. కార్యక్రమంలో కోనసీమ జనసేన నాయకులు గిడుగు శేఖర్ పాల్గొన్నారు.

మమ్దానీ గెలుపు.. ప్రపంచానికి మలుపు

సిపిఎం జిల్లా నాయకులు జుత్తిగ నరసింహమూర్తి

వీరవాసరం : అమెరికా నడిబొడ్డు న్యూయార్క్ నగర మేయర్‌గా డెమొక్రటిక్ పార్టీ నేత 34 ఏళ్ల జోహ్రాన్ మమ్దానీ గెలుపు ప్రపంచానికి మలుపు అని సిపిఎం జిల్లా నాయకులు జుత్తిగ నరసింహమూర్తి అన్నారు. మేయర్‌గా ఘన విజయం సాధించిన మమ్దానీకి జేజేలు పలుకుతూ సిపిఎం ఆధ్వర్యాన ఆదివారం నవుడూరు జంక్షన్లో అభినందన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి జుత్తిగ నరసింహమూర్తి మాట్లాడుతూ అమెరికాలో ట్రంప్ విధానాలతో విసుగుపోయిన ప్రజలు డెమొక్రటిక్ పార్టీ సోషలిస్ట్ భావాలు కలిగిన మమ్దానీను గెలిపించడం ట్రంపుకు చెంప పెట్టు అన్నారు. ఇతను కమ్యూనిస్టు అని, గెలవనీయ కూడదని అన్ని పార్టీలను ఏకం చేసి ట్రంపు ఎంత ఖర్చు చేసినా న్యూయార్క్ ప్రజలు మమ్దానీను మేజర్‌గా ఎన్నుకోవడం ప్రజలు మార్పు కోరుకుంటున్నారని అన్నారు. మమ్దానీని గెలిపిస్తే మేము ఈ నగరాన్ని వదిలి వెళ్లిపోతామని ప్రకటించిన లక్ష మంది ప్రయాణం ఎటని వారిని ప్రశ్నించారు. మొన్న శ్రీలంక, నిన్న నేపాల్, నేడు న్యూయార్క్, ఢిల్లీ, పాండిచ్చేరి, కేరళలో పేదరిక నిర్మూలన. అంటే ప్రపంచం సోషలిజం వైపు చూస్తుందని, ఇది మార్పుకి నాంది పలుకుతోందన్నారు. దోపిడీ విధానాలకు వ్యతిరేకంగా ప్రజలు తిరగబడే పరిస్థితులు వస్తున్నాయని అక్కడ ట్రంప్, ఇక్కడ మోడీ ఆలోచించుకోవాల్సిన రోజులు వస్తున్నాయని తెలిపారు. ట్రంప్ విధానాల వల్ల అమెరికాలో ధరలతో పాటు నిరుద్యోగం పెరిగిందన్నారు. ప్రపంచవ్యాప్తంగా సోషలిస్టు శక్తులు బలపడడం శుభ పరిణామమన్నారు. మనదేశంలో కూడా సోషలిస్ట్ శక్తులు బలపడాల్సిన అవసరం ఎంతైనా ఉందని, ప్రధానంగా యువత సమాజం మార్పు కోసం, దోపిడీ విధానాలకు వ్యతిరేకంగా ముందుకు రావాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో తాళ్లూరి రాము, యండమూరి సుబ్బారావు, కేతా జ్యోతిబసు, యాళ్లబండి నారాయణమూర్తి, పాల కోటేశ్వరరావు, గొట్టుముక్కల శ్యాంబాబు, కిలాడి సత్యనారాయణ, జుత్తిగ శ్రీనివాసు, కుడిపూడి పెద్దిరాజు, మొల్లి అప్పారావు, గజ్జి పాల్గొన్నారు.

నవుడూరు జంక్షన్‌లో జేజేలు పలుకుతున్న నేతలు

ఉపాధి హామీలో ప్రతి ఒక్కరికీ పని కల్పిస్తా

డ్వామా పీడీ కెసిహెచ్.అప్పారావు

ప్రజాశక్తి - కాళ్ల

జిల్లా పరిధిలో మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం ద్వారా పని దినాల కల్పనతో పాటుగా అభివృద్ధి కార్యక్రమాలకు ప్రణాళికాబద్ధంగా ముందుకెళుతూ గ్రామసభలు ద్వారా 2026-27 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి పంచాయతీల్లో గ్రామసభలు నిర్వహించి అందరి ఆమోదంతో పనులు గుర్తిస్తున్నామని పశ్చిమ గోదావరి జిల్లా నీటి యాజమాన్య సంస్థ ప్రాజెక్ట్ డైరెక్టర్ కెసిహెచ్.అప్పారావు పేర్కొన్నారు. ప్రజాశక్తికి ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన మాట్లాడారు. 2024-25 ఆర్థిక సంవత్సరంలో 100 రోజులు పనిదినాలు 4,500 కుటుంబాలకు కల్పించామన్నారు. ఏడాది 1300 కుటుంబాలకు 100 రోజులు పని దినాలు కల్పించామన్నారు. రాష్ట్రంలో 11వ స్థానంలో పశ్చిమగోదావరి జిల్లా నిలిచిందని డ్వామా పీడీ కెసిహెచ్.అప్పారావు తెలిపారు. జిల్లాలోని ఉపాధి హామీ కూలీలకు 36 లక్షల పనిదినాల కల్పన లక్ష్యంగా పనిచేస్తున్నామన్నారు. జిల్లాలోగల 20 మండలాల్లో జీవనోపాధి భద్రతను పెంపొందించుటకై, ప్రతి కుటుంబానికి ఒక ఆర్థిక సంవత్సరంలో 100 రోజుల ఉపాధిని కల్పిస్తున్నామన్నారు. జిల్లా కలెక్టర్ నాగరాణి ప్రత్యేక సూచనలతో జిల్లాల్లో రైతాంగానికి మేలు చేకూర్చేలా కార్యక్రమాలను అమలు చేస్తున్నట్లు వివరించారు.

ప్రశ్న : ఈ ఆర్థిక సంవత్సరంలో ఇప్పటి వరకు ఉపాధి హామీ నిధుల ద్వారా చేపట్టిన కార్యక్రమాలను వివరించండి?

పీడీ : జిల్లా పరిధిలో 2025-26 సంవత్సరానికి సంబంధించి ఏప్రిల్ నుండి నేటికి 32 లక్షల పని దినాలను కల్పించాం. ఇందుకుగాను కూలీలకు రూ.100 కోట్లు చెల్లించడం జరిగింది. జనవరి, ఫిబ్రవరి, మార్చి నెలల్లో 4 లక్షల పని దినాలు పూర్తి చేయడం జరుగుతుంది.

ప్రశ్న : హార్టికల్చర్ ఎన్ని ఎకరాల్లో చేయాలని నిర్ణయించారు? ఎంతమంది రైతులను గుర్తించారు?

పీడీ : ఉపాధి హామీ నిధులతో రైతులకు మేలు చేకూర్చేలా ప్రత్యేక ప్రణాళికగా హార్టికల్చర్ విభాగం సహకారంతో 300 ఎకరాల్లో పండ్ల తోటలకు 158 మంది రైతులను గుర్తించాం.

ప్రశ్న : గోకులాల నిర్మాణాల ఎన్ని? ఎంత సొమ్ము కేటాయించారు?

పీడీ : గత ఏడాదిలో 800 గోకులం షెడ్డులకు 750 షెడ్డుల పనులు చేయడం జరిగింది. రూ.10 కోట్లు చెల్లించారు. ఈ ఏడాది 450 గోకులాల నిర్మాణానికి రూ.6 కోట్ల ఉపాధి హామీ నిధులను కేటాయించాం.

ప్రశ్న : గ్రామసభల ద్వారా ఏ పనులు గుర్తించారు?

పీడీ : కాలువల్లో పూడికతీత పనులు, హార్టికల్చర్ ప్లాంటేషన్, గోకులం షెడ్లు నిర్మాణం, అమృత సరోవర్ ట్యాంక్‌ల వివిధ పనులు గుర్తించాం.

ప్రశ్న : జిల్లాలోఎంత మంది ఉపాధి కూలీలకు పని కల్పించారు?

పీడీ : మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం ద్వారా జిల్లాలో 30 వేల మంది ఉపాధి హామీ కూలీలు పనిచేస్తున్నారు.

ప్రశ్న : రోజువారీ వేతనం ఎంత చెల్లిస్తున్నారు?

పీడీ : ఒక్కొక్క పని దినానికి సగటున రోజువారీ వేతనం రూ.290 చొప్పున చెల్లించాము. ప్రస్తుతం 2025-26 ఆర్థిక సంవత్సరంలో సగటు దినసరి వేతనం రూ.290 ఇవ్వడం జరుగుతుంది.

ప్రశ్న : 100 పని దినాలు ఏడాది ఎన్ని కుటుంబాలకు కల్పించారు?

పీడీ : ఈ ఏడాది 1300 కుటుంబాలకు 100 పని దినాలు కల్పించాం.

చట్టం ముందు అందరూ సమానమే

జూనియర్ సివిల్ జడ్జి పివిఎన్.రంజిత్‌కుమార్

తణుకు : చట్టం ముందు అందరూ సమానమేనని మొదటి అదనపు జూనియర్ సివిల్ జడ్జి పివిఎన్.రంజిత్‌కుమార్ అన్నారు. ఆదివారం ఛైర్మెన్, నాల్గవ అదనపు జిల్లా జడ్జి డి.సత్యవతి ఆదేశాల మేరకు స్థానిక బిసి కాలేజ్ గర్ల్స్ హాస్టల్‌లో న్యాయ సేవల దినోత్సవం సమావేశం జరిగింది. ఈ సందర్భంగా జడ్జి పివిఎన్.రంజిత్‌కుమార్ మాట్లాడుతూ.. ఆర్థిక పరిస్థితులు బాగోలేక న్యాయం పొందలేకపోతున్నారని, స్తోమత లేక అన్యాయానికి గురౌతున్న వారికోసం న్యాయసేవల చట్టం 1987 వచ్చిందని, దానిలో చట్టం 12 ప్రకారం ఉచిత న్యాయ సహాయం మహిళలు, షెడ్యూల్ కులాలు, షెడ్యూల్ తెగలు, పిల్లలు, కస్టడీ ముద్దాయిలు, సంవత్సర ఆదాయం రూ.3 లక్షలలోపు ఉన్నవారు అర్హులని తెలిపారు. జాతీయ న్యాయ సేవల చట్టం ద్వారా బాధిత మహిళలకు, యాసిడ్ ఎటాక్ లాంటి బాధితులకు పరిహారాలు కూడా అందిస్తుందన్నారు. సివిల్, క్రిమినల్ కేసుల్లో న్యాయవాదిని పెట్టుకునే స్తోమత లేని వారికి ఉచిత న్యాయవాదిని ఏర్పాటు చేసి న్యాయ సహాయం అందిస్తుందని తెలిపారు. సమావేశంలో న్యాయవాదులు కామన మునిస్వామి, కౌరు వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

అల్లుకున్న నిర్లక్ష్యం..

విద్యుత్ స్తంభం చుట్టూ పాదులు

తొలగించాలని స్థానికుల వేడుకోలు

ప్రజాశక్తి - నరసాపురం

పట్టణంలోని 19వ వార్డు రాయపేట లెనిన్ హై స్కూల్ ఎదురుగా విద్యుత్ స్తంభానికి చుట్టూ పిచ్చిమొక్కల పాదులు పెరిగిపోయాయి. దీంతో సరఫరాకు తరచూ అంతరాయం కలుగుతోందని స్థానికులు చెబుతున్నారు. వర్షాకాలం కావడంతో ఏమాత్రం కొద్దిగా వర్షం పడినా విద్యుత్ తీగలకు పాదులు తగిలి నిప్పులు వస్తున్నాయని స్థానికులు చెబుతున్నారు. విద్యుత్ శాఖ అధికారులు ఇప్పటికైనా స్పందించి విద్యుత్ తీగలపై పాదులను తొలగించాలని కోరుతున్నారు.

విద్యుత్ తీగలకు అల్లుకున్న పాదులు

వృద్ధులకు వైద్య పరీక్షలు

ప్రజాశక్తి - తణుకు

సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్, నిసా ఫౌండేషన్ వారు సంయుక్తంగా నిర్వహించు ఇంటికి పరిమితమైన అనారోగ్య వృద్ధులకు సంచారశకటం ద్వారా ఇంటింటికీ వైద్యం కార్యక్రమంలో భాగంగా ప్రముఖ నేత్ర వైద్యులు డాక్టర్ హుస్సేన్ అహ్మద్, ఆర్థో డాక్టర్ నిమ్మగడ్డ అచ్యుతరామయ్య తణుకులోని పలు ప్రాంతాల్లో పర్యటించారు. 8 మంది అనారోగ్య వృద్ధులకు ఉచిత వైద్య సేవలు అందజేశారు. సంఘ సభ్యులు ఆకుల వెంకటేశ్వరరావు ఆర్థిక సహకారంతో ఉచితంగా మందులు అందజేశారు. ఈ కార్యక్రమంలో సంఘ కోశాధికారి అర్జి భాస్కరరావు, సభ్యులు గిరిజాల నాగేశ్వరరావు, నర్సింగ్ సిబ్బంది పాల్గొన్నారు. ఈ ఉచిత వైద్య సేవలు కోరేవారు స్వయంగా గాని లేదా సెల్ నెం 9985343530, 9059290717లకు తెలియజేయాలని తెలిపారు.

పరీక్షిస్తున్న వైద్యులు

వైసిపి యూత్ అధ్యక్షులుగా ఉపేంద్ర

ప్రజాశక్తి - ఆచంట

యువతను, విద్యార్థులను దగా చేసిన ఘనత ఏకైక ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌లకే దక్కుతుందని వైసిపి యువజన విభాగం మండల అధ్యక్షులు కోటే శశిమధు అన్నారు. ఆదివారం ఎ.వేమవరంలో వైసిపి మండల కన్వీనర్ జక్కంశెట్టి చంటి ఆధ్వర్యాన యువజన విభాగం నాయకులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వైసిపి యూత్ అధ్యక్షులుగా దొంగ ఉపేంద్రను ఎన్నుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వైసిపి బలోపేతంలో భాగంగా మండలంలో వైసిపి యూత్ గ్రామ కమిటీలు ఏర్పాటు చేయడం జరుగుతుందని తెలిపారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి నిరుద్యోగులకు నెలకు రూ.10 వేలు ఇస్తామని ఎన్నికల హామీ ఇచ్చి గాలికి వదిలేశారని ఆరోపించారు. డిగ్రీ చదువుకున్న విద్యార్థులకు నిరుద్యోగ భృతి ఇస్తామని హామీలు ఇచ్చి తుంగలో తొక్కారన్నారు. ప్రజావ్యతిరేక విధానాలు అవలంబిస్తున్న కూటమి ప్రభుత్వానికి వైసిపి తరుపున తగిన గుణపాఠం చెప్తున్నామని హెచ్చరించారు. అనంతరం ప్రభుత్వ మెడికల్ కళాశాల ప్రయివేటీకరణను వ్యతిరేకిస్తూ కోటి సంతకాల సేకరణ కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో వైసిపి గ్రామ కమిటీ అధ్యక్షులు యడ్ల రామకృష్ణ, కోట గిరిధర్, వీర వీరాస్వామి, కొవ్వల సురేష్, గిద్దాడ హరిబాబు, కండెల్లి రాంబాబు, సదమ్మ తాతబ్బాయి, గుడాల చిరంజీవి పాల్గొన్నారు.

నరసాపురం : మాట్లాడుతున్న ఎంఎల్ఎ నాయకర్

పలుచోట్ల వన సమారాధన

ప్రజాశక్తి - నరసాపురం

పట్టణంలోని 12వ వార్డులోని సాయిబాబా గుడి వెనుక శ్రీచౌడేశ్వరి దేవి దేవాంగ సంఘం ఆధ్వర్యాన కార్తీకమాస వన సమారాధన కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ విప్, నరసాపురం ఎంఎల్ఎ బొమ్మిడి నాయకర్, టిడిపి ఇన్‌ఛార్జి పొత్తూరి రామరాజు పాల్గొన్నారు. ఈ సందర్భంగా బొమ్మిడి నాయకర్ దేవాంగ సంఘం నిర్వహించిన ఈ వన సమారాధన కార్యక్రమం సామాజిక ఐక్యతకు దారితీసే విధంగా ఉందని అభినందించారు.

మొగల్తూరు : చిన్నారులను ఉన్నత విద్యావంతులుగా, అన్ని రంగాల్లో రాణించేలా తీర్చిదిద్దాలని రాజ్యసభ మాజీ సభ్యులు మోపిదేవి వెంకటరమణ, విప్ బొమ్మిడి నాయకర్‌లు సంఘ సభ్యులకు సూచించారు. మండలంలోని ముత్యాలపల్లి గ్రామంలో అగ్నికుల క్షత్రియ సామాజిక తరగతి కార్తీక వన సమారాధనను కొల్లాటి బాబురావు, నాగిడి రాంబాబు, బర్రి నాగరాజు ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా కొల్లాటి బాబురావు అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. యువత రాజకీయ రంగంలో రాణించి ప్రజల మన్ననలు అందుకోవాలని మోపిదేవి వెంకటరమణ అన్నారు. అగ్నికుల క్షత్రియ కార్పొరేషన్ ఛైర్మన్ చిలకలపూడి పాపారావు మాట్లాడారు. స్టూడెంట్ అసెంబ్లీకి నరసాపురం నియోజకవర్గం నుంచి మండలంలోని ముత్యాలపల్లి గ్రామంలో బండి ముత్యాలమ్మ జెడ్‌పి ఉన్నత పాఠశాల నుండి ఎంపికైన తిరుమని పూజశ్రీని విప్ నాయకర్, నరసాపురం మున్సిపల్ ఛైర్‌పర్సన్ బర్రె వెంకటరమణ, సంఘ సభ్యులు సాలువ కప్పి ఘనంగా సత్కరించారు. సంఘ అభ్యున్నతిపై ఏర్పాటు చేసిన పుస్తకాలను, గోడపత్రికలను నాయకులు ఆవిష్కరించారు. వన సమారాధన కార్యక్రమానికి సంఘ సభ్యులు అధిక సంఖ్యలో కుటుంబ సమేతంగా హాజరై ఉల్లాసంగా గడిపారు.

ఆకివీడు : కార్తీకమాసం వనసమారాధనలు ఊపందుకున్నాయి. మూడవ ఆదివారం, సోమవారం కావడంతో అన్ని సంఘాలు ఎవరికి వారు తమ సంఘ భోజనాలు ఏర్పాటు చేసుకుంటున్నారు. ఈ సందర్భంగా పలు రకాల సాంస్కృతిక కార్యక్రమాలు కూడా చోటు చేసుకుంటున్నాయి. ఎక్కడ చూసినా కార్తీక సమారాధనలే. అంతా హడావిడి మరొక వారం ఉండడంతో అన్ని సంఘాలు తొందరగా పూర్తిచేసుకుంటున్నాయి. వీటితోపాటు ఆయా సంఘాలలో ఆర్థిక, పారిశ్రామిక, రాజకీయ, ఉద్యోగ, సామాజిక రంగాలలో ఉన్నత స్థాయిని అందుకున్న వారిని ఆహ్వానించి కార్యక్రమానికి ప్రత్యేక ఆకర్షణ ఏర్పరుస్తున్నారు. వారి అనుభవాలను సలహాలను తీసుకోవడం చేస్తున్నారు. వారితో పాటు పలువురు సంఘ పెద్దలను కలిపి సన్మానించడం ఒక ఆనవాయితీగా మారింది. ఈ పరంపరలో పెళ్లిళ్ళు, పేరంటాలు సీజన్ల కన్నా ఎక్కువగానే కమ్యూనిటీ హాల్స్ కళ్యాణ మండపాలకు డిమాండ్ పెరిగింది. అన్ని బుక్ అయిపోతున్నాయి. వీటితోపాటు తోటల్లో కూడా చక్కటి వాతావరణం ఏర్పాటు చేసుకుంటున్నారు. అయితే వాన భయంతో ముందస్తు జాగ్రత్తలుగా మండపాలు కూడా బుక్ చేసుకుంటున్నారు. మొత్తం మీద ఈ కార్తీకమాసం వనభోజనాలు వ్యక్తుల మధ్య సామాజిక వ్యత్యాసాన్ని, ఆర్థిక వ్యత్యాసాన్ని తొలగించి సమైక్యత నినాదాన్ని పెంచుతుందని చెప్పాలి.

బండి ముత్యాలమ్మ సన్నిధిలో యాత్రికులు

ప్రజాశక్తి - మొగల్తూరు

మండలంలోని ముత్యాలపల్లి గ్రామంలో ఉన్న బండి ముత్యాలమ్మ అమ్మవారి ఆలయం ఆదివారం యాత్రికులతో కలకలలాడింది. ఆలయ ప్రాంగణంలో బండి ముత్యాలమ్మ భజన సంఘం ఆలపించిన గీతాలు ప్రజలను ఆకట్టుకున్నాయి. యాత్రికులకు ఎటువంటి అసౌకర్యాలు కలగకుండా ఆలయ కార్యనిర్వహణ అధికారి మోకా అరుణ్ కుమార్, ఛైర్మన్ కడలి మాణిక్యాలరావు పర్యవేక్షణలో ఆలయ సిబ్బంది, పాలకవర్గ సభ్యులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ప్రసాదం వితరణ తదితర సేవా కార్యక్రమాలు నిర్వహించారు.

ముత్యాల పల్లె చిన్న బండి ముత్యాలమ్మ అమ్మవారిని రాజ్యసభ మాజీ సభ్యులు మోపిదేవి వెంకటరమణ, మాజీ మంత్రి రాష్ట్ర కాపు కార్పొరేషన్ ఛైర్మన్ కొత్తపల్లి సుబ్బారాయుడు వేర్వేరుగా దర్శించుకున్నారు. వారికి ఆలయ కార్యనిర్వాహణాధికారి మోకా అరుణ్ కుమార్, ఛైర్మన్ కడలి మాణిక్యాలరావులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. ఆలయంలోని ఏర్పాట్లపై ఆరాదీశారు. యాత్రికులకు ఎటువంటి అసౌకర్యాలు కలగకుండా ఏర్పాటు చేయాలని సూచించారు. వారి వెంట పలువురు నాయకులు ఉన్నారు.

ప్రజాశక్తి ప్రతి అక్షరం - ప్రజల పక్షం

పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు ఈక్రింది నెంబర్లను సంప్రదించండి

ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 94900 99190

పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 83339 88814

మెడికల్ కాలేజీల ప్రయివేటీకరణ విరమించాలి

వైసిపి ఆధ్వర్యాన కోటి సంతకాల సేకరణ

12న ప్రజా ఉద్యమం ర్యాలీ పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి - ఆచంట

వైసిపి ఆధ్వర్యాన కోటి సంతకాల సేకరణ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆదివారం మాల మహానాడు కార్యాలయంలో అధ్యక్షులు నన్నేటి పుష్పరాజ్ మెడికల్ కాలేజీలు ప్రయివేట్‌పరం చేయొద్దని కోరుతూ కోటి సంతకాల సేకరణలో భాగంగా స్వయంగా సంతకం చేశారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో సర్పంచి జక్కంశెట్టి చంటి మాట్లాడుతూ బడుగు బలహీన తరగతుల పేదవారు చదువుకు దూరం కాకూడదన్నారు. ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ విద్య ఉచితంగా అందించిన రోజే బడుగు బలహీన తరగతులు అత్యున్నత స్థాయికి వెళతారన్నారు. అనంతరం పుష్పరాజ్ మాట్లాడుతూ విద్యకు దూరం చేయాలని చూస్తే అఖిలపక్ష పార్టీలతో పాటు మాల మహానాడు కూడా రోడ్డెక్కి ఉద్యమాలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో గ్రామ ఉప సర్పంచి కొండేటి సురేష్ బాబు, వైసిపి గ్రామ అధ్యక్షులు ఎడ్ల రత్నరాజు, కొవ్వల సురేష్, గుడాల చిరంజీవి, దొంగా ఉపేంద్ర పాల్గొన్నారు.

ఉండి : మెడికల్ కాలేజీల ప్రయివేటీకరణను నిరసిస్తూ ఈనెల 12వ తేదీన చేపట్టనున్న ప్రజా ఉద్యమం పోస్టర్‌ను ఉండి వైసిపి అధ్యక్షులు పివిఆర్‌కె.ఆంజనేయరాజు ఆధ్వర్యాన ఎంపిపి శ్రీహరి నారాయణరాజు, వైసిపి నాయకులు ఆదివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పలువురు వైసిపి నాయకులు మాట్లాడుతూ ప్రతి ఒక్కరికీ మెరుగైన వైద్యం అందించాలనే ఉద్దేశ్యంతో నాటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి ఆరోగ్యశ్రీని తీసుకొచ్చారని, తండ్రి బాటలో తనయుడు మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి అధికారంలో ఉండగా 17 ప్రభుత్వ మెడికల్ కాలేజీలను తీసుకురాగా వాటిలో ఏడు మెడికల్ కాలేజీలు అందుబాటులోకి వచ్చాయన్నారు. మిగిలిన కాలేజీలు వివిధ దశలలో ఉండగా వాటిని ప్రైవేటీకరించేందుకు కూటమి ప్రభుత్వం యత్నించడం దుర్మార్గమన్నారు. దీంతో డాక్టర్ కావాలనే నిరుపేద ప్రతిభావంతులైన విద్యార్థుల ఆశ నిరాశైందని, కూటమి ప్రభుత్వం ప్రయివేటీకరణ నిర్ణయాన్ని ఉపసంహరించుకునే వరకు వివిధ దశలలో ప్రజా ఉద్యమాన్ని చేపడతామని వారు వివరించారు. ఈ కార్యక్రమంలో వైసిపి గ్రామ అధ్యక్షులు కరిమెరక మల్లికార్జున, సీనియర్ నాయకులు కరిమెరక రామచంద్రరావు, గులిపల్లి అచ్చారావు, రణస్థుల మహంకాళి, ఏడిద వెంకటేశ్వరరావు, గలావిల్లి ధనుంజయ, శివ నాగరాజు, బడుగు బాలాజీ, అంగర రాంబాబు, గెద్దా భోగేశ్వర రావు, అడబాల నాని పాల్గొన్నారు.

తణుకు : వైసిపి ప్రభుత్వ హయాంలో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి 17 మెడికల్ కళాశాలలు తీసుకువచ్చి, 5 కళాశాలలు పూర్తిచేసి పేదలకు అందుబాటులోకి తెచ్చి చరిత్ర సృష్టిస్తే నేడు చంద్రబాబునాయుడు వాటిని ప్రయివేటీకరణ చేయాలని కంకణం కట్టుకున్నారని మాజీ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు మండిపడ్డారు. తణుకు వైసిపి కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. పులివెందులలో 150 మెడికల్ సీట్లు వచ్చినా మాకు వద్దని చెప్పారని, నేడు వైద్య కళాశాల నుంచి సామాగ్రిని గుంటూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారని విమర్శించారు. పేదలకు నాణ్యమైన వైద్యాన్ని పైసా ఖర్చులేకుండా అందించాలని చూస్తే ఈ ప్రభుత్వం మాత్రం ప్రయివేటు పేరుతో పెత్తందార్లకు ధారాదత్తం చేస్తున్నారని అన్నారు. ఈ కుట్రలను అడ్డుకునే క్రమంలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన పిలుపుమేరకు ఈనెల 12న భారీగా ర్యాలీ నిర్వహించి తహశీల్దార్‌కు వినతిపత్రం అందజేయనున్నామని తెలిపారు. అసలు వైద్య కళాశాలలే లేవని నమ్మించాలని చూసిన కూటమి నేతలు నేడు మెడికల్ సీట్లు ఎందుకు వచ్చాయని నిలదీశారు. 17 కళాశాలల్లో 5 కళాశాలల్లో ఇప్పటికే మొదటి ఏడాది వైద్య విద్య నడుస్తుందని తెలిపారు. మన జిల్లాలో పాలకొల్లు మెడికల్ కళాశాల అందుబాటులోకి వస్తే గుండె, కిడ్నీ, కేన్సర్ వంటి వ్యాధులకు ఖరీదైన వైద్యం ఉచితంగా అందుతుందన్నారు. పేదల వైద్యం కోసం జగన్ ఆరోగ్యశ్రీని రూ.25 లక్షలకు పెంచితే, కూటమి ప్రభుత్వం ఆరోగ్యశ్రీని ఎత్తేసే స్థితికి వచ్చిందన్నారు. ఎట్టి పరిస్థితుల్లో మెడికల్ కళాశాలలను ప్రభుత్వమే నడపాలనే ప్రధాన డిమాండ్‌తో ఉద్యమం చేస్తామని అన్నారు. 12న జరిగే ర్యాలీలో అన్ని సిపిఐ, సిపిఎం పార్టీలు, ప్రజలు పాల్గొంటున్నారని తెలిపారు. అనంతరం ప్రభుత్వ వైద్య కళాశాలల ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా వైసిపి ప్రజా ఉద్యమం ర్యాలీకి సంబంధించిన పోస్టర్‌ను నరసాపురం పార్లమెంట్ పరిశీలకులు ముదునూరి మురళీకృష్ణంరాజు, మాజీ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు, పార్టీ శ్రేణులు ఆవిష్కరించారు. ఈనెల 12న నిర్వహించే ర్యాలీలో నియోజకవర్గం నుంచి పార్టీ శ్రేణులు, ప్రజానీకం పెద్ద ఎత్తున పాల్గొనాలని కారుమూరి కోరారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు మారిశెట్టి శేషగిరి, జిల్లా ఆర్గనైజేషన్ సెక్రటరీ యిండుగపల్లి బలరామకృష్ణ, డిసిఎంఎస్ మాజీ డైరెక్టర్ పెన్మెత్స సుబ్బరాజు, తణుకు మండల మహిళాధ్యక్షురాలు ఉండవల్లి జానకి, పట్టణ మహిళాధ్యక్షురాలు నూకల కనకదుర్గ, ముళ్లపూడి బాబూరావు పాల్గొన్నారు.



ఆచంట : వేమవరంలో సంతకాలు సేకరిస్తున్న వైసిపి నేతలు

CHANGE OF NAME

I, KOTHAPALLI RAMESH S/o KOTHAPALLI SUBBARAO shall henceforth be known as KOTTAPALLI RAMESH S/o KOTTAPALLI SUBBARAO.

మహారాజశ్రీ రాజమండ్రి ఫ్యామిలీ కోర్టు

FCOP 287/2024

Between:-

సాగి ఈశ్వరమ్మ ...పిటీషనరు

మరియు

సాగి సురేష్ రాజు ...రెస్పాండెంటు

టు.

సాగి సురేష్ రాజు, తండ్రి పద్మరాజు, డోర్‌నెం.5-59, రాజులరామాలయం వద్ద, శృంగవృక్షం, పాలకోడేరు మండలం, పశ్చిమగోదావరి జిల్లా 534243

పై దావా సాగి ఈశ్వరమ్మగారు మీ పై విడాకులు కోరుచూ 13-08-2014 తేదీన మీ ఇద్దరికి జరిగిన వివాహమును రద్దు చేయవలసిందిగా పై కోర్టులో దావా వేసియున్నారు. కావునా మీరు పై రాజమండ్రి ఫ్యామిలీ కోర్టు నందు 15-12-2025 ఉదయం 10.30 గంగలకు హాజరు కావలసియున్నది. మీరు రాని యెడల మీకు వ్యతిరేకంగా పరోక్షముగా తీర్పు చెప్పబడును. తప్పక హాజరు కావలెను.

G.U.V.B.రాజు

వాది తరుపు అడ్వకేట్

వీవర్సు కాలనీ, రాజమండ్రి

సెల్.9848370855

రైతు సంఘం జిల్లా మహాసభ జయప్రదం చేయాలి

14, 15 తేదీల్లో మోగల్లులో నిర్వహణ

సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి హరే రామ్

ప్రజాశక్తి - భీమవరం

ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా 23వ మహాసభ ఈనెల 14, 15 తేదీల్లో మోగల్లు గ్రామంలో విజయలక్ష్మి ఫంక్షన్ హాల్లో నిర్వహిస్తున్నట్లు రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఆకుల హరే రామ్ తెలిపారు. ఈమేరకు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ మహాసభను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.

పెంటపాడు : ఈనెల 14, 15 తేదీల్లో జరుగుతున్న రైతు సంఘం 23వ జిల్లా మహాసభలు జయప్రదం చేయాలని కోరుతూ పెంటపాడు ప్రజాసంఘాల కార్యాలయం వద్ద రైతు సంఘం ముఖ్యుల సమావేశం జరిగింది. ఈ సమావేశాన్ని ఉద్దేశించి రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు చిర్ల పుల్లారెడ్డి, నాయకులు సిరపరపు రంగారావు, బంకురు నాగేశ్వరరావు, కరక వెంకట్రావు మాట్లాడుతూ 2014లో మన ప్రధానమంత్రి మోడీ ఎన్నికల ప్రచారంలో మేము అధికారంలోకి వస్తే రైతు సమస్యలు పరిష్కరిస్తామని చెప్పిన తర్వాత వ్యవసాయ రంగం సంక్షోభంలో పడిందన్నారు. అయితే ఆయన ఎన్నికల్లో రైతు ఆత్మహత్యలు నివారిస్తానని, వ్యవసాయం లాభసాటిగా తయారు చేస్తానని, వ్యవసాయ రంగానికి స్త్రీకరణ నిధి ఏర్పాటు చేస్తానని వాగ్దానం చేశారని, ఆయన చెప్పిన మాటలకు పొంతన లేకుండా ఉందన్నారు. మోడీ అధికారంలోకి వచ్చిన తర్వాత ఈ దేశంలో సుమారు 5 లక్షల మంది రైతులు ఆత్మ చేసుకున్నారని, వ్యవసాయం గిట్టుబాటు కాక ఆత్మహత్యలు పెరుగుతున్నాయని, ఆత్మహత్య నివారణకు ఒక కమిటీ వేశారని, ఆ కమిటీ ఛైర్మన్‌గా డాక్టర్ స్వామినాథన్ దేశమంతా తిరిగి ఆత్మహత్యలు ఆగాలంటే పెట్టిన పెట్టుబడికి 50 శాతం కలిపి ఇస్తే వ్యవసాయ రంగం సంక్షోభం నుంచి బయట పడతుందని, రైతు ఆత్మహత్యలు నివారించవచ్చని సూచించారన్నారు. అది ఈరోజుకి కూడా అమలు చేయలేదని వారు విమర్శించారు. ఈ జిల్లా మహాసభలోనే వ్యవసాయ రంగంలో ఉన్న సమస్యలను చర్చించి తగు నిర్ణయాలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో అల్లు సుబ్బారావు, చీర వెంకన్న, పెనగంటి దుర్గా, సన్నాసమ్మ, కిషోర్, రవణ, బర్ల బాలాజీ, దౌర్ల సీతయ్య, వెన్నెల శ్రీను, గంటా కోటి, సిరపు గణేష్, బేతా అప్పారావు, సలమూరి సత్యనారాయణ, గోర్ల రమేష్, సిరప్ మహేష్ పాల్గొన్నారు.

క్వాలిఫై మ్యాచ్లో 32 మంది

మెయిన్ డ్రాకు టెన్నిస్ క్రీడాకారులు విజయం

ప్రజాశక్తి - పాలకొల్లు

బుద్ధ అవతారం రాజు మెమోరియల్ ఆల్ ఇండియా సీనియర్ ర్యాంకింగ్ టెన్నిస్ టోర్నమెంట్ ఆదివారం నిర్వహించిన క్వాలిఫై పోటీలలో 32 మంది మెయిన్ డ్రాకు క్రీడాకారులు ఎంపికైనట్లు ఆర్గనైజింగ్ సెక్రటరీ జిఎస్‌విఆర్ఎస్ఎన్.రాజు(బూన్ రాజు) విలేకరులకు తెలిపారు. క్వాలిఫైయింగ్ మ్యాచ్లలో 82 మంది 45, 55, 65, 70 సంవత్సరాలు దాటిన క్రీడాకారులు పాల్గొన్నారు. సీనియర్స్ టెన్నిస్ ర్యాంకింగ్ ఉన్న వివిధ రాష్ట్రాలకు చెందిన 72 మంది క్రీడాకారులు సోమవారం ఉదయం 8 గంటల నుండి నరసాపురంలోనే రెండు కోర్టులలో, పాలకొల్లులోని రెండు కోర్టులను ఆడతారని, అంతేకాకుండా కోర్టు అంపైర్స్‌గా వినుకొండ దినేష్(నరసాపురం), పి.వర్మ(పాలకొల్లు), ఎన్.శ్రీనివాసరాజు(నరసాపురం), పి.కిరణ్(పాలకొల్లు), మ్యాచ్లకు చీఫ్ రిఫ్రిగా సంతోష్(హైదరాబాద్) వ్యవహరిస్తారన్నారు. అదేవిధంగా డే అండ్ నైట్ మ్యాచ్లు ఫ్లడ్ లైట్ల వెలుతురులో ఆడతారని ఆయన తెలిపారు.

నేడు పోటీల ప్రారంభోత్సవం

ముఖ్య అతిథిగా పాల్గొననున్న మంత్రి నిమ్మల రామానాయుడు

సోమవారం సాయంత్రం 4 గంటలకు కాస్మో కల్చరల్ స్పోర్ట్స్ కాంప్లెక్స్ అధ్యక్షుడు గొట్టుముక్కల గాంధీ భగవాన్ రాజు అధ్యక్షతన ఇనాగరేషన్ ఫంక్షన్ ఏర్పాటు చేసినట్లు ముఖ్య అతిథిగా రాష్ట్ర జల వనరుల శాఖ మంత్రి డాక్టర్ నిమ్మల రామానాయుడు, నరసాపురం ఆర్‌డిఒ దాసిరాజు, ఇతర ప్రముఖులు పాల్గొంటారని తెలిపారు.

అభివృద్ధి, సంక్షేమానికి పెద్దపీట

సిఎం చంద్రబాబు రాష్ట్రానికి, భవిష్యత్తు తరాలకు బ్రాండ్

న్యూజిలాండ్ టిడిపి ఎన్ఆర్ఐ సదస్సులో ఎంఎల్ఎ రాధాకృష్ణ

ప్రజాశక్తి - తణుకు

గత అయిదేళ్ల వైసిపి పరిపాలనలో అమరావతిని వైఎస్ జగన్మోహన్ రెడ్డి భ్రష్టు పట్టించారని తణుకు ఎంఎల్ఎ అరిమిల్లి రాధాకృష్ణ విమర్శించారు. తిరిగి అధికారంలోకి వచ్చిన చంద్రబాబు నాయుడు అమరావతికి పునరుజ్జీవం పోసారని తెలిపారు. న్యూజిలాండ్ ఎన్ఆర్ఐ టిడిపి సమావేశంలో ఆదివారం ఎంఎల్ఎ రాధాకృష్ణ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ.. రాష్ట్రంలో చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, మంత్రి నారా లోకేష్ సారథ్యంలో అభివృద్ధి, సంక్షేమాన్ని సమపాళ్లలో అమలు చేస్తున్నారని తెలిపారు. అమరావతి నిర్మాణంలో పరిపాలన భవనాలు నిర్మిస్తున్నారని, గతంలో 70 శాతం అమరావతి నిర్మాణాన్ని పూర్తిచేసిన చంద్రబాబు నాయుడు తదనంతర కాలంలో అధికారంలోకి వచ్చిన జగన్మోహన్ రెడ్డి కనీసం 6 శాతం పనులు కూడా పూర్తి చేయలేదని విమర్శించారు. మరోవైపు పోలవరం నిర్మాణాన్ని సైతం చంద్రబాబు నాయుడు పరుగులు పెట్టిస్తున్నారన్నారు. రెండు ప్రాజెక్టులు పూర్తయిన తర్వాత 2029 నాటికి ఎన్నికలకు వెళతామని పేర్కొన్నారు. సిబిఎన్ అనే మూడు అక్షరాలు రాష్ట్రానికి, భవిష్యత్తు తరాలకు ఒక బ్రాండ్ అన్నారు. అధికారంలోకి వచ్చిన 16 నెలల్లోనే రూ.16 లక్షల కోట్లు పెట్టుబడులు రాష్ట్రానికి వచ్చాయన్నారు. అనేక రంగాల్లో రాష్ట్రానికి పెట్టుబడులు వస్తున్నాయి అంటే కేవలం చంద్రబాబు నాయుడు చేస్తున్న కృషి కారణంగానే అని తెలిపారు.

పంట నష్టం నమోదు తేదీ పొడిగించాలి

నష్టపరిహారానికి కౌలు రైతుల పేర్లు నమోదు చేయాలి

కౌలు రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రామాంజనేయులు

ప్రజాశక్తి - భీమవరం

పంటనష్టం నమోదు తేదీ పొడిగించి కౌలురైతుల పేర్లు నమోదు చేయాలని ఎపి కౌలురైతు సంఘం డిమాండ్ చేసింది. ఇటీవల వచ్చిన మొంథా తుపానుకి పంట నష్టపోయిన కౌలురైతులకు నష్టపరిహారం నమోదు చేయడంలో తీవ్ర అన్యాయం జరిగిందని ఆరోపించారు. ఈమేరకు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మామిడిశెట్టి రామాంజనేయులు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేసారు. ఇటీవల వచ్చిన తుపానుకి జిల్లాలో 20 మండలాలు, 257 గ్రామాల్లో 24 వేల ఎకరాల వరకు పంట దెబ్బతిందని పేర్కొన్నారు. దీనిలో నూటికి 80 శాతం కౌలురైతులు పంట కోల్పోయారని తెలియజేశారు. జిల్లాలో 21,236 మంది రైతుల పేరున పంట నష్టం నమోదు చేయగా కేవలం 11,283 మందికి కౌలురైతుల పేరున పంటనమోదు చేశారన్నారని, పంట నమోదులో ఎడిట్ ఆప్షన్ ఇచ్చి కౌలురైతుల పేరున పంటనష్టం నమోదు చేయాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ కమిషనర్, జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లామని పేర్కొన్నారు. పైస్థాయి అధికారులు ఆప్షన్ వుందని కౌలురైతుల పేరున పంటనష్టం నమోదు చేస్తామని చెబుతున్నా ఆచరణలో జరగలేదని, వ్యవసాయ శాఖ మండల అధికారుల దృష్టికి తీసుకెళ్తే సమయం అయిపోయింది, లిస్టులు జిల్లా కేంద్రానికి పంపేశామని చెబుతున్నారని తెలియజేశారు. రాసిన పంటనష్టంలో కూడా రైతుసేవా సిబ్బంది పూర్తి స్థాయిలో రాయమని అలా రాస్తే మీ పంట కొనుగోలు చేయమని చెబుతున్నారని ఆరోపించారు. పంట నమోదుకి ప్రభుత్వం శనివారం వరకు సమయం ఇచ్చినా శనివారం సెలవు రావడంతో నమోదు ప్రక్రియ జరగలేదని పేర్కొన్నారు. ఈ పరిస్థితుల్లో ఈనెల 18 వరకు పంటనమోదు సమయం పొడిగించాలని, కౌలురైతుల పేరున పంటనష్టం నమోదు చేసి ఆదుకోవాలని, ఎకరాకు 25 వేల రూపాయలు పంటనష్ట పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు.

కొవ్వలి ఆధ్వర్యాన ఉచిత ఆక్యుపంక్చర్ వైద్య శిబిరం

ప్రజాశక్తి - నరసాపురం

కొవ్వలి రామ్మోహన్ నాయుడు అందిస్తున్న ఉచిత ఆక్యుపంక్చర్ వైద్య సేవలు పేదలకు వరంగా నిలుస్తాయని కొవ్వలి ఫౌండేషన్ కార్యదర్శి, ఆక్యుపంక్చర్ వైద్య నిపుణుడు కొండా శ్రీధర్ అన్నారు. ఆదివారం నరసాపురం పట్టణం 1వ వార్డు శ్రీహరిపేటలో కుళాయి చెరువు వద్ద కొవ్వలి ఫౌండేషన్ ఆధ్వర్యాన ఏర్పాటు చేసిన ఉచిత ఆక్యుపంక్చర్ శిబిరంలో రోగులకు శ్రీధర్ వైద్య సేవలు అందించి మాట్లాడారు. సర్వరోగ నివారిణి ఆక్యుపంక్చర్ వైద్యమన్నారు. ఎలాంటి మందులు, ఇంజెక్షన్లు, శస్త్ర చికిత్సలు అవసరం లేకుండా అన్ని రకాల వ్యాధులను ఆక్యుపంక్చర్ వైద్యం ద్వారా నివారించ వచ్చునని తెలిపారు. పేదలకు, అనాథలకు, ఆపదలో ఉన్న వారికి కొవ్వలి ఫౌండేషన్ ద్వారా తమ కుటుంబ సభ్యుడు కొవ్వలి యతిరాజ రామ్మోహన్ నాయుడు సేవలను అందిస్తున్నారని, ఆయన ఆశయాలకు అనుగుణంగా తాము కూడా తనవంతు సేవలు అందిస్తున్నామని శ్రీధర్ తెలిపారు. సుమారు 100 మంది రోగులకు వైద్య సేవలను అందించామని తెలిపారు. కార్యక్రమంలో కొవ్వలి ఫౌండేషన్ ట్రెజరర్ కొవ్వలి జయలక్ష్మి, సంకు భాస్కర నాయుడు, చిన్నాయమ్మ, సందక సురేష్, జి.రేఖ, బోగి రెడ్డి ముత్యం, అంద్రాజు లక్ష్మణ్ ఉన్నారు.

వైద్య పరీక్షలు చేస్తున్న శ్రీధర్

జాతీయ న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యాన న్యాయ సదస్సు

ప్రజాశక్తి - నరసాపురం

జాతీయ న్యాయ సేవాధికార సంస్థ దినోత్సవం సందర్భంగా నరసాపురం 29వ వార్డు అరుంధతిపేటలోని కమ్యూనిటీ హాల్‌లో మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యాన కౌన్సిలర్ సిర్రా కాంతమ్మ అధ్యక్షతన న్యాయ విజ్ఞాన సదస్సును నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా 10వ అదనపు జిల్లా న్యాయమూర్తి ఎ.వాసంతి పాల్గొని 1987లో ప్రజా ప్రయోజనాలకు ఏర్పడిన న్యాయ సేవాధికార సంస్థ ముఖ్యోద్దేశం అయిన లోక్ అదాలత్, ఉచిత న్యాయ సహాయం, న్యాయ విజ్ఞాన సదస్సులు వీటి ద్వారా ప్రజలకు కలిగే ఉపయోగాలు, నల్సా 16 స్కీముల గురించి వివరించారు. అందరూ చట్టాలపై అవగాహన కలిగి ఉన్నప్పుడే ఏ సమస్యకు ఎవరిని సంప్రదించాలో తెలుస్తుందన్నారు. పిల్లలు ఎటువంటి తగాదాలకు వెళ్లకుండా తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని, ఒకసారి పోలీసు స్టేషన్ లో కేసు నమోదైతే ప్రభుత్వ ఉద్యోగానికి అర్హత కోల్పోతారన్నారు. అందరూ కుల, మత, వర్గ విభేదాలు లేకుండా కలిసికట్టుగా ఉండాలన్నారు. బాల్య వివాహాలను వ్యతిరేకించాలి, పిల్లలకు మంచీచెడుల గురించి చెప్పాలన్నారు. పోక్సో చట్టం తీవ్రమైన శిక్షలను విధిస్తుందని, అందుకే మైనర్ బాలబాలికలను చాలా జాగ్రత్తగా క్రమశిక్షణలో పెంచాలని, ఆర్థికంగా అందరూ వృద్ధి చెందాలంటే ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా విద్యావంతులవ్వాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి ఆర్. వరలక్ష్మి, బార్ అసోసియేషన్ వైస్ ప్రెసిడెంట్ వి.నాగేశ్వరరావు, తహశీల్దార్ సత్యనారాయణ, మున్సిపల్ రెవెన్యూ అధికారి మురళీధర్, సబ్ ఇన్‌స్పెక్టర్ మల్లికార్జునరావు, ఎఎస్ఐ సూర్య భాస్కరరావు, లీగల్ సర్వీసెస్ సభ్యులు దానయ్య నాయుడు, సతీష్ కుమార్, చాముండేశ్వరి, ప్రగతి, పద్మజ, శ్రీనివాస్, శిరీష పాల్గొన్నారు.

నేడు యథావిధిగా పిజిఆర్ఎస్ : ఆర్‌డిఒ

నరసాపురం : నరసాపురం సబ్ కలెక్టర్ కార్యాలయంలో ఈనెల 10వ తేదీన సోమవారం యథావిధిగా ప్రజాఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు నరసాపురం ఆర్‌డిఒ దాసిరాజు తెలిపారు. డివిజన్లోని అన్ని శాఖల అధికారులు అందుబాటులో ఉంటారని వివరించారు. సబ్ డివిజన్లోని అన్ని తహశీల్దార్ కార్యాలయాల్లో యథావిధిగా జరుగుతుందన్నారు. ప్రజలు తమ ఫిర్యాదులు, దరఖాస్తులను ఉదయం 10:30 నుంచి అందించాలని కోరారు.

బిసిల అభ్యున్నతికి ప్రభుత్వం కృషి

రాష్ట్ర దేవాంగ అభ్యుదయ సేవా సంఘం రాజకీయ విభాగం కో ఆర్డినేటర్ అల్లాడ సూర్య భాస్కర్‌రావు

ప్రజాశక్తి - పెనుమంట్ర

బిసిల అభ్యున్నతికి రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న 'ఆదరణ పథకం' బిసిలకు వరంగా నిలుస్తుందని రాష్ట్ర దేవాంగ అభ్యుదయ సేవా సంఘం రాజకీయ విభాగం కో ఆర్డినేటర్ అల్లాడ సూర్య భాస్కర్‌రావు అన్నారు. ఆదివారం మార్టేరులో ఆయన మాట్లాడుతూ చేనేతల అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ చూపుతూ ఉచిత విద్యుత్ 200 యూనిట్లు, పనిముట్లు పంపిణీ, నేతన్న భరోసా వంటి పథకాలను వీలైనంత త్వరగా అందించాల్సిన అవసరం ఉందని ఆయన అన్నారు. చేనేత వృత్తిని ప్రోత్సహించే క్రమంలో నారా వారి కుటుంబం చేనేతలకు బ్రాండ్ అంబాసిడర్‌గా నిలవడం ఎంతో శుభ పరిణామమని ఆయన అభిప్రాయపడ్డారు. చేనేత వృత్తి పునరుజ్జీవనంతో గ్రామీణ ఆర్థిక వ్యవస్థ బలపడుతుందని సూర్య భాస్కర్ రావు నమ్మకం వ్యక్తం చేశారు.

మహారాజశ్రీ రాజమండ్రి ఫ్యామిలీ కోర్టు

FCOP 214/2023

Between:-

సాగి ఈశ్వరమ్మ

సాగి ఆద్విక(మైనర్ తరుపున తల్లి)

...పిటిషనర్లు

మరియు

సాగి సురేష్ రాజు ...రెస్పాండెంటు

టు.

సాగి సురేష్ రాజు, తండ్రి పద్మరాజు, డోర్‌నెం.5-59, రాజులరామాలయం వద్ద, శృంగవృక్షం, పాలకోడేరు మండలం, పశ్చిమగోదావరి జిల్లా 534243

పై కోర్టులో సదరు దావాలో పిటిషనర్లు మనోవర్తి కోరుచూ మీ పై దావా వేసియున్నారు. ది.15-12-2025 మీరు హాజరు కొరకు వాయిదా అయివున్నది. కావునా మీరు పై రాజమండ్రి ఫ్యామిలీ కోర్టు నందు 15-12-2025 ఉదయం 10.30గంగలకు హాజరు కావలసి యున్నది. మీరు రాని యెడల మీకు వ్యతిరేకంగా పరోక్షముగా తీర్పు చెప్పబడును. తప్పక హాజరు కావలెను.

G.U.V.B.రాజు

వాది తరుపు అడ్వకేట్

వీవర్సు కాలనీ, రాజమండ్రి

సెల్.9848370855

పాస్‌పోర్టు పోయినది

దొంగ ఆదిత్య, తండ్రి,: శ్రీనివాస రావు, డోర్ నెంబర్ 8-133(2), అల్లంగుంట, పెనుమదం గ్రామం, పోడూరు మండలం, ప.గో.జిల్లా,ఎ.పి ప్రజలకు తెలియజేయునది ఏమనగా నేను ది 05-06-2023లో వైజాగ్ పాస్ పోర్ట్ ఆఫీస్ నుంచి Y5006690 నెంబర్ పాస్ పోర్ట్ పొంధియున్నాను. ది 03-11-2025న అల్లంగుంటలోని మా ఇంటి నుంచి పెనుమదంలోని జెరాక్స్ సెంటర్‌లో నా పాస్ పోర్ట్ జెరాక్స్ తీయించుటకు బైక్‌పై వెళుతుండగా దారిలో నా ఒరిజినల్ పాస్ పోర్ట్ పడిపోయినది. ఎంత వెతికిన ఎక్కడ దొరకలేదు. ఎవరికైన దొరికిన పై నా అడ్రస్‌కు నా ఒరిజినల్ పాస్ పోర్ట్ అందజేయగలరు.

నా సెల్ నెంబర్ 9676711397

IN THE COURT OF THE PRINCIPAL CIVIL JUDGE (JUNIOR DIVISION) JUDGE - CUM - JUDICIAL MEGISTRATE OF 1st CLASS : BHIMAVARAM

F.D.P.I.A.No.6/2024 in O.S.No.723/2005

Petitioners/ Plaintiffs : Grandhi Varalakshmi and another 1.Cell No.8985457999, 2.Cell No.9247296199

Respondents : Sannidhi Sri Rama Chandra Murthy and Others

RESPONDENTS/DEFENDANTS:

9.Sannidhi Srinivasu, S/o.Venugopala Rao, "S" Turning, Main Road, Akividu, Akividu Mandal.

17. Bandaru Venkayamma, W/o.(Late) Rama Rao, R/o.Muslim Street, Akividu, Akividu Mandal.

18.Bandaru Suresh Kumar, S/o.(Late) Rama Rao, R/o.Muslim Street, Akividu, Akividu Mandal.

19. Bandaru Ramesh Kumar, S/o.(Late) Rama Rao, R/o.Muslim Street, Akividu, Akividu Mandal.

21.Sannidhi Eswari, W/o.(Late) Lakshmi Gupta, R/o.'S' Turning, Main Road, Akividu, Akividu Mandal.

పై నెంబరు ఫైనల్ డిక్రీ పిటీషన్‌లో పిటీషనర్లు, 9,17 to 18,19 మరియు 21 రెస్పాండెంట్లుకు కోర్టు ద్వారాను, పోస్టు ద్వారాను నోటీస్లు జారీ చేయించినప్పటికి 9,17 to 19 and 21 రెస్పాండెంట్లు అయిన మీరు సదరు నోటీస్లు తీసుకోకుండా తప్పించుకొనుచున్నారు. సదరు ఫైనల్ డిక్రీ పిటీషనులో 9,17 to 19 and 21 రెస్పాండెంట్లు అయిన మీ హాజరు నిమిత్తం కోర్టు వారు ది.20-11-2025 సంగరం తేదీకి వాయిదా వేసినారు. సదరు వాయిదా తేదీ ఉదయం గం.10.30 నిగలకు పైకోర్టు వారి ఎదుట 9,17 to 19 and 21 రెస్పాండెంట్లు అయ్యి మీరు హాజరై మీకు గల అక్షేపణలు తెలియచేసుకోవలెను. లేనిఎడల రెస్పాండెంట్లు 9,17 to 19 and 21 అయ్యి మీ పరోక్షమందు సదరు పిటీషను తీర్మానించడమగును.

K.V.Suryanarayana

Advocate, Sarrajuvari Street,

Bhimavaram -534201, A.P.

Cell: 98494 04488.

IN THE COURT OF THE PRINCIPAL CIVIL JUDGE (JUNIOR DIVISION) JUDGE - CUM - JUDICIAL MEGISTRATE OF 1st CLASS : BHIMAVARAM

I.A.No.812 of 2024 in

F.D.P.I.A.No.6/2024 in O.S.No.723/2005

Petitioners/ Plaintiffs : Grandhi Varalakshmi and another 1.Cell No.8985457999, 2.Cell No.9247296199

Respondents : Sannidhi Sri Rama Chandra Murthy and Others

RESPONDENTS/DEFENDANTS:

9.Sannidhi Srinivasu, S/o.Venugopala Rao, "S" Turning, Main Road, Akividu, Akividu Mandal.

17. Bandaru Venkayamma, W/o.(Late) Rama Rao, R/o.Muslim Street, Akividu, Akividu Mandal.

18.Bandaru Suresh Kumar, S/o.(Late) Rama Rao, R/o.Muslim Street, Akividu, Akividu Mandal.

19. Bandaru Ramesh Kumar, S/o.(Late) Rama Rao, R/o.Muslim Street, Akividu, Akividu Mandal.

21.Sannidhi Eswari, W/o.(Late) Lakshmi Gupta, R/o.'S' Turning, Main Road, Akividu, Akividu Mandal.

పై నెంబరు పిటీషన్‌లో పిటీషనర్లు, 9,17 to 19 and 21 రెస్పాండెంట్లు అయ్యి మీకు కోర్టు ద్వారాను, పోస్టు ద్వారాను నోటీస్లు జారీ చేయించినప్పటికి 9,17 to 19 and 21 రెస్పాండెంట్లు అయిన మీరు సదరు నోటీస్లు తీసుకోకుండా తప్పించు కొనుచున్నారు. సదరు పై నెంబరు పిటీషనులో 9,17 to 19 and 21 రెస్పాండెంట్లు అయిన మీ హాజరు నిమిత్తం పై నెంబరు పిటిషనును కోర్టు వారు ది.20-11-2025 సంగరం తేదీకి వాయిదా వేసినారు. సదరు వాయిదా తేదీ ఉదయం గం.10.30 నిగలకు పైకోర్టు వారి ఎదుట 7,17 to 19 and 21 రెస్పాండెంట్లు హాజరై మీకు గల అక్షేపణలు తెలియచేసుకోవలెను. లేనిఎడల కోర్టు వారు పై నెంబరు పిటీషనును 7,17 to 19 and 21 రెస్పాండెంట్లు పరోక్షమందు తీర్మానించడమగును.

K.V.Suryanarayana

Advocate, Sarrajuvari Street,

Bhimavaram -534201, A.P.

Cell: 98494 04488.